సాక్షి
జగిత్యాల

సోమవారం। 27। జనవరి। 2025



న్యూస్‌రీల్

బల్దియాల స్పెషల్ ఆఫీసర్‌గా అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి


గౌతంరెడ్డి

రాయికల్: జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ మున్సిపాలిటీలకు స్పెషల్ ఆఫీసర్‌గా జిల్లా అడిషనల్ కలెక్టర్ గౌతమ్ రెడ్డిని నియమిస్తూ ప్రిన్సిపాల్ సెక్రటరీ దాన కిషోర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపాలిటీల పాలకమండలి పదవీకాలం ముగియడంతో సోమవారం నుంచి స్పెషల్ ఆఫీసర్ పాలన కొనసాగనుంది. ఈ మేరకు అడిషనల్ కలెక్టర్‌ను స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక


మంజూరుపత్రాలు అందిస్తున్న అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి

రాయికల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతుభరోసా, రైతు ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలలో లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తామని అడిషనల్ కలెక్టర్ గౌతమ్ రెడ్డి అన్నారు. ఆదివారం రాయికల్ మండలం ధర్మాజీపేట గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు మంజూరుపత్రాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి మనోజ్, ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీవో సుష్మ, మండల వ్యవసాయ శాఖ అధికారి ముక్తేశ్వర్, ఏపీవో దివ్య పాల్గొన్నారు.

పేరు లేనివారు దరఖాస్తు చేసుకోండి


మంజూరు పత్రాలు అందిస్తున్న అడిషనల్ కలెక్టర్

మల్యాల: గ్రామసభల్లో పేరు రానివారు మరోమారు దరఖాస్తు చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్.లత అన్నారు. మండలంలోని సర్వాపూర్‌లో ఆదివారం ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించారు. అర్హులందరికీ పథకాలు అందిస్తామన్నారు. గ్రామంలో రేషన్‌కార్డులు 127మందికి, ఇందిరమ్మ ఇళ్లు 111 మందికి, ఆత్మీయ భరోసా 33మందికి, రైతు భరోసా 635మందికి మంజూరు పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ స్వాతి, తహసీల్దార్ మునీందర్, మండల వ్యవసాయాధికా రి కె.చంద్రదీపక్, ఎంపీఓ ప్రవీణ్, ఆర్ఐ తిరుపతి,ఏపీఓ శ్రీనివాస్, ఈసీ మనోజ్ పాల్గొన్నారు.

న్యాయవాద వృత్తికి గౌరవం తేవాలి


బహుమతి అందిస్తున్న నాగేశ్వర్‌రావు

మెట్‌పల్లి: వృత్తికి గౌరవం తెచ్చేలా న్యాయవాదులు వ్యవహరించాలని మెట్‌పల్లి సీనియర్ సివిల్ కోర్టు మేజిస్ట్రేట్ నాగేశ్వర్‌రావు అన్నారు. కోర్టులో ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వృత్తిపరంగా రాణించాలంటే చట్టాల పట్ల సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు. ఆ తర్వాత ఇటీవల నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలు, రన్నర్‌ప్‌లుగా నిలిచిన మేజిస్ట్రేట్, బార్ అసోసియేషన్ టీంలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మున్సిఫ్ కోర్టు మేజిస్ట్రేట్ అరుణ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి తదితరులున్నారు.

సీఐకి పలువురి అభినందన


సీఐకి శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీస్ సిబ్బంది

మెట్‌పల్లి/మెట్‌పల్లిరూరల్: ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికైన సీఐ నిరంజన్‌రెడ్డిని పలువురు అభినందించారు. ఎస్సై కిరణ్‌కుమార్, స్థానిక పోలీస్ సిబ్బంది సీఐతో ప్రత్యేకంగా కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విధి నిర్వాహణలో సీఐ తమకు ఆదర్శంగా నిలిచారన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్దన్, మర్కజీ ఇంతేజామి కమిటీ అధ్యక్షుడు అక్తర్ జానీలతో పాటు మైనార్టీ నాయకులు రైసుద్దీన్, ముఖీం, హఫీజ్,పిడుగు తిరుపతిరెడ్డి, జగ్గాసాగర్ గ్రామస్తులు సీఐని సన్మానించారు.

అన్ని రంగాల్లో ముందుకు..


జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, విప్ అడ్లూరి, ఎమ్మెల్యే సంజయ్, కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ తదితరులు


రాయికల్: భరతమాత వేషధారణలో చిన్నారి

జగిత్యాల: జిల్లా అన్నిరంగాల్లో ముందుకెళ్తోందని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని, లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపడుతామని స్పష్టం చేశారు. ఆదివారం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం మాట్లాడారు. రాజ్యాంగం 1950 జనవరి 26న అమల్లోకి వచ్చిందన్నారు. స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన అమరవీరులు, రాజ్యాంగవేత్తలకు జోహార్లు తెలిపారు. రాజ్యాంగంలో పొందుపర్చిన సూత్రాలు, ఆదర్శాలకు తోడ్పడటం పౌరులుగా అందరి కర్తవ్యమన్నారు. రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. విద్యుత్, నీటిపారుదల, వ్యవసాయం, ఉద్యోగ, ఉపాధి కల్పనలో ముందున్నామని తెలిపారు. సంక్షేమ పథకాలకు ప్రతిఒక్కరిని అర్హులను చేస్తామన్నారు.

- అర్హులందరికీ పథకాలు
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక
- మహాలక్ష్మితో మహిళలకు మేలు
- కలెక్టర్ సత్యప్రసాద్ వెల్లడి
- ఘనంగా గణతంత్ర వేడుకలు
- పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



పోలీసుల వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

ఉపాధి కూలీలకు ఆత్మీయ భరోసా
భూమిలేని కుటుంబాలకు ఏటా రూ.12 వేలు ఇవ్వడానికి రాష్ట్రప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద అమలు చేస్తామన్నారు. జిల్లాలోని 24,147 మంది ఉపాధి హామీ కూలీలను ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద లబ్ధిదారులుగా గుర్తించి గ్రామసభల ఆమోదం కోసం పంపించామన్నారు. భూమిలేని ఉపాధి కూలీలను గుర్తించి రూ.6వేల చొప్పున ఏడాదికి రెండు విడతలు చెల్లించనున్నట్లు వివరించారు.

వ్యవసాయ యోగ్యమైన భూమికి రైతుభరోసా..
రైతులను ఆదుకోవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం రైతు భరోసా కింద ఏటా ఎకరాకు రూ.12వేల చొప్పున అందించనున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలో దాదాపు 2.27లక్షల మందికి రూ.208.93 కోట్లు అందించనున్నట్లు వివరించారు.

ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు
అర్హులైన నిరుపేదలందరికీ రేషన్‌కార్డులు అందిస్తామని కలెక్టర్ ప్రకటించారు. లబ్ధిదారులకు నెలకు 6కిలోల చొప్పున ప్రతి సభ్యునికి ఉచితంగా బియ్యం సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో 19,974 నూతన రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. 49,899 మంది కొత్త వ్యక్తులను నమోదు చేశామన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు
బడుగు, బలహీనవర్గాలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వనుందన్నారు. ప్రతి నియోజకవర్గానికి కనీసం 3500 చొప్పున కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇందుకు దరఖాస్తులు స్వీకరించామన్నారు.

మహిళలకు రూ.110 కోట్ల లబ్ధి
మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణ వసతి కల్పించామని, ఈ పథకం ద్వారా ఇప్పటివరకు రూ.110.20 కోట్ల లబ్ధి చేకూరిందని తెలిపారు. జిల్లాలో 2023 డిసెంబర్ 9 నుంచి ఇప్పటివరకు 2,75,44,973 మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకున్నారని పేర్కొన్నారు.

ఆరోగ్యశ్రీ పెంపు
ప్రభుత్వం నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్న ఉద్దేశంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ సహాయాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిందన్నారు. అలాగే కొత్తగా 163 చికిత్సలను ఈ పథకంలో చేర్పించిందన్నారు. ఇప్పటివరకు 1837 చికిత్సలకు రూ.10 లక్షలకు ఉచిత వైద్యం అందిందన్నారు. 85,548 మంది పేదలకు ఉచిత చికిత్స అందిందన్నారు.

రూ.500కే సిలిండర్
ప్రభుత్వం పేద మహిళలకు మహాలక్ష్మీ పథకం ద్వారా రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ అందించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 2,89,725 గ్యాస్ కనెక్షన్లకు రూ.500 చొప్పున ఇస్తున్నామన్నారు.

ప్రతి ఇంట్లో విద్యుత్ కాంతులు
పేదలకు విద్యుత్ భారం తగ్గించాలన్న ఉద్దేశంతో 200 యూనిట్లకన్నా తక్కువ విద్యుత్ వినియోగించే ప్రతి ఇంటికీ ఉచిత వెలుగులు పంచుతున్నామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1,93,686 మంది కుటుంబాలకు లబ్ధి చేకూర్చిందన్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు 7.75 కోట్లు సబ్సిడీగా చెల్లించిందన్నారు.

అర్హులైన రైతులకు రుణమాఫీ
అర్హులైన రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి అయ్యిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 80,515 మంది రైతులకు రూ.721.74 కోట్ల రుణమాఫీ అయ్యిందన్నారు.

సన్నరకాలకు బోనస్
ప్రభుత్వం రైతులకు బోనస్ అందించాలన్న ఉద్దేశంతో సన్నరకం క్వింటాలుకు రూ.500 బోనస్ అందించిందన్నారు. ఇప్పటివరకు 5,580 మంది రైతులు పండించిన 30,626 టన్నుల సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. రూ.500 చొప్పున వారందరికీ బోనస్ వేశామన్నారు.

విద్యావ్యవస్థలో మార్పులు
ప్రభుత్వం విద్యా వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చిందన్నారు. విద్యను పటిష్ఠ పర్చాలనే ఉద్దేశంతో ప్రీప్రైమరీ స్కూళ్లుగా మార్చామన్నారు. పాఠశాలలు ప్రారంభించినప్పుడే విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు అందించామన్నారు. జిల్లాను రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలపాలనే ఉద్దేశంతో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ మోడల్‌స్కూల్స్ నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాకు కేంద్రీయ విద్యాలయం, నవోదయ విద్యాలయం మంజూరయ్యాయని, 2025–26 విద్యా సంవత్సరానికి తరగతులు ప్రారంభించేందుకు తాత్కాలిక భవనాన్ని గుర్తించామన్నారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, ఎస్పీ అశోక్‌కుమార్, అదనపు కలెక్టర్లు లత, గౌతమ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోవాలి

కథలాపూర్: ప్రభుత్వ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మండలంలోని పోసానిపేటలో లబ్ధిదారులకు ఆదివారం ప్రొసీడింగ్ కాపీలను పంపిణీ చేశారు. గ్రామంలో 115 మందికి కొత్త రేషన్‌కార్డులు, 177 మంది పేర్పు చేర్పు, 477 మందికి రైతు భరోసా, 58 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 128 మందికి ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలను అందించారు. అర్హులుంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆర్డీవో జివాకర్‌రెడ్డి, డీపీవో మదన్‌మోహన్, ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ వినోద్, ఏవో యోగితా, ఏఎంసీ చైర్మన్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు


ఆయుధాలతో విప్, కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ


గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్


గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు


రాయికల్: చిన్నారుల ప్రదర్శనలు


రాయికల్: చిన్నారుల ప్రదర్శనలు


రాయికల్: జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినుల బతుకమ్మ ఆట


కోరుట్లరూరల్: సరస్వతీ శిశుమందిర్ విద్యార్థుల ప్రదర్శన

పదేళ్ల నిరీక్షణకు తెర


నాయికపుగూడెంలో మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్: రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ పేదలకు ఇళ్లు, రేషన్‌కార్డులు ఇవ్వలేకపోయిందని, కాంగ్రెస్ మాత్రం ఏడాదిలోనే ప్రక్రియను ప్రారంభించిందని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాయికపుగూడెంలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను ఆదివారం అందించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందన్నారు. గిరిజనులకు ఇళ్ల నిర్మాణాలకు రూ.6లక్షలు, మిగిలిన సామాజిక వర్గాలకు రూ.5 లక్షలు అందించనుందని తెలపగా.. రూ.6లక్షలకు ఇల్లు నిర్మాణం పూర్తికాదని పలువురు గిరిజనులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన గ్రామాన్ని దత్తత తీసుకుని ఇళ్ల నిర్మాణం పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సుజాత, తహసీల్దార్ జమీర్, ఎంపీడీవో గంగాధర్, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

- ప్రతి ఒక్కరికీ అందుతాయి
- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

సంక్షేమ పథకాలు ప్రారంభం

జగిత్యాల: పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని మెడికల్ కళాశాల గెస్ట్ హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. పదేళ్లలో ధర్మపురి, పెగడపల్లి, గొల్లపల్లి సొసైటీలను బీఆర్ఎస్ పాలకులు నిర్వీర్యం చేశారని ఆరోపించారు. సొసైటీల్లో అక్రమాలపై విచారణ చేపట్టాలని ఫిర్యాదు చేశామని, కమిటీ విచారించి నివేదిక తయారుచేసిందని, అయితే బీఆర్ఎస్ నాయకులు హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చారని తెలిపారు. దీనిపై విచారణ అడిగితే మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పెగడపల్లి సొసైటీ నుంచే అనుమతి లేకుండా రూ.1.64 కోట్ల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి డ్రా చేశారని, 2016లో రూ.60 కోట్లతో ప్రారంభమైన రోళ్లవాగు ప్రాజెక్ట్ రూ.160 కోట్ల వ్యయాన్ని పెంచినా ఎందుకు పూర్తి చేయలేదో జవాబు చెప్పాలన్నారు. గోదావరిలో నీరు లేక రైతులు ఇబ్బంది పడితే టీఎంసీ నీటిని విడుదల చేయించామన్నారు. నాయకులు నిషాంత్ రెడ్డి, బీమ సంతోష్, శైలేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం


మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామని అడ్లూరి అన్నారు. మండలంలోని కమలాపూర్‌లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ప్రొసీడింగ్‌లను అందించారు. పేర్లు రానివారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాయపట్నం నుంచి ఆరెపల్లి వరకున్న లిఫ్టుల నిర్వాహణ రైతులు కాకుండా ప్రభుత్వమే చేపట్టాలని కోరడం జరిగిందని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ చిలుముల లావణ్య, ఏడీ రాంచందర్, ఎంపీడీవో రవీందర్ తదితరులున్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
వెల్గటూర్: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో లబ్ధిదారులకు ప్రొసీడింగులను ఆర్డీవో మధుసూదన్‌తో కలిసి అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గోపిక, వైస్ చైర్మన్ తిరుపతి, తహసీల్దార్ రవికాంత్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శైలేందర్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి


మరియమ్మ (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ మానాల మరియమ్మ (50) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. టీచర్ కుటుంబానికి ఐసీడీఎస్ అధికారులు రూ.20 వేలు, అంగన్‌వాడీ టీచర్లు రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. మరియమ్మ మృతదేహానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధానకార్యదర్శి కడారి రాములు నివాళి అర్పించారు. అంగన్‌వాడీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఓరుగంటి శ్యామల, పద్మ, సూర్య, చంద్రకళ, వజ్రమ్మ, లక్ష్మీబాయి, వసంత, అరుంధతి, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడు..

మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూర్ గ్రామానికి చెందిన ఓ బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. పచ్చునూర్‌కు చెందిన కనకం వశీకర్ (12) తిమ్మాపూర్ మైనార్టీ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి పండుగ సెలవులకు పచ్చునూర్‌లోని నాన్నమ్మ ఇంటికి వచ్చాడు. శనివారం పచ్చునూర్ నుంచి తన చెల్లెను అమ్మమ్మ గ్రామం కెల్లేడులో వదిలిపెట్టి తిమ్మాపూర్ వెళ్తానని ఇంట్లో చెప్పి వచ్చారు. కెల్లేడులోని ఇంట్లో ఊయలకు ఉన్న చీర మెడకు బిగుసుకుపోయి అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నాడు. బాలుడి తండ్రి విద్యాసాగర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి గ్రామానికి చెందిన వైద తిరుపతి (50) ఆదివారం వేకువజామున ఇంటి ఆవరణలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుపతి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, బాధ భరించలేక ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని కుటుంబీకులు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు.

వీణవంకలో మహిళ..

వీణవంక(హుజూరాబాద్): మండల కేంద్రానికి చెందిన నీల రమ్య అలియాస్ మరుపాక రమ్య(26) భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాలు.. రెండేళ్ల క్రితం రమ్య వీణవంకకు చెందిన నీల సాయికిరణ్‌ను కులాంతర వివాహం చేసుకుంది. భర్త రోజూ మద్యం సేవించి కట్నం తీసుకురావాలని మానసికంగా, శారీరకంగా వేధించడంతో ఆదివారం ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి మేనమామ కొమ్ము శ్యాం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.


ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లత


గౌతంరెడ్డి, అదనపు కలెక్టర్ · రఘువరణ్, డీఆర్‌డీఓ · మదన్‌మోహన్, డీపీవో · రఘుచందర్, డీఎస్పీ · అరిఫ్‌ఖాన్, సీఐ · రాంమోహన్, తహసీల్దార్ · విజయ్‌కుమార్‌రెడ్డి, ఆర్‌ఎంఓ · ఎండీ.ఇమ్రాన్, ప్రిన్సిపాల్

లక్ష్మణ్, సీనియర్ అసిస్టెంట్ · వెంకటేశ్వర్‌రావు, సోషల్ వెల్ఫేర్ · మణీశ్ ఏఆర్ ఎస్సై · వాణిరెడ్డి · కొండయ్య, పీఆర్ · రమేశ్, ఫార్మసిస్ట్ · రాములు, హెడ్‌కానిస్టేబుల్ · కొండయ్య, ఐసీడీఎస్

ఉత్తమ సేవలకు అవార్డులు

జగిత్యాలటౌన్:జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన వారికి 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అవార్డులు అందించారు. కలెక్టర్ సత్యప్రసాద్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ చేతులమీదుగా పురస్కారాలు అందించారు.


అరిఫ్ అలీఖాన్, సీఐ స్పెషల్ బ్రాంచ్, ఉజ్మా పర్వీన్, ఎక్సైజ్ (దంపతులు)


సౌజన్య, ప్రొఫెసర్


చెక్ అందుకుంటున్న మహిళా సంఘాలు


మధుసూదన్ గౌడ్, ఆర్డీవో, జగిత్యాల


రమ, వైద్యురాలు

కాలిన కార్మికుల గుడిసెలు

- దాదాపు రూ.5 లక్షల ఆస్తి నష్టం
- పనికి వెళ్లడంతో తప్పిన ప్రాణ నష్టం
- ఆదుకోవాలని కార్మికుల వేడుకోలు


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

సిరిసిల్లక్రైం: జిల్లా కేంద్రంలోని సాయినగర్ కార్గిల్ లేక్ సమీపంలో ఆదివారం కార్మికుల గుడిసెలు కాలి బూడిదయ్యాయి. ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాలు.. సాయినగర్‌లో మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతానికి చెందిన కార్మికులు భవన నిర్మాణ పనుల కోసం వచ్చి దాదాపు 16 గుడిసెలు వేసుకుని ఉంటున్నారు. రోజువారీగా కూలీలు పని వెళ్లిన సమయంలో ఓ గుడిసె నుంచి మంటలు రావడంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఒకదాని నుంచి మరో గుడిసెకు మంటలు వ్యాపించడంతో అక్కడున్న గుడిసెలన్నీ అంటుకున్నాయి. నిత్యవసర సరుకులు, బట్టలు, వంట సామగ్రి కాలిబూడిదయ్యాయి. ఆస్తి నష్టం రూ.5 లక్షల వరకు ఉంటుందని సిరిసిల్ల స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేందర్ పేర్కొన్నారు.

దర్యాప్తు చేస్తున్నం



కార్మికుల గుడిసెలు కాలిపోవడానికి కారణాలు స్పష్టంగా చెప్పలేం. వారందరూ రోజువారీ వంటకు కట్టెల పొయ్యి వాడుతారు. అలా ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నాం. పూర్తి వివరాల కోసం దర్యాప్తు జరుగుతుంది. అయితే ప్రమాదంలో నిత్యవసరాలు మాత్రమే కాలిపోయాయి. కార్మికులందరూ పనికి వెళ్లడంతో పెను ప్రమాదం తప్పింది.

– నరేందర్, సిరిసిల్ల ఫైర్ స్టేషన్ అధికారి

పని కోసం ఉన్నాం..



ఇక్కడ మాకు సంబంధించి 16 కుటుంబాలు ఉన్నాయి. మా గుడిసెలు కాలిపోయినట్లు కొందరు తెలిపితే పని నుంచి పరుగుపరుగున వచ్చాం. గుడిసెలన్నీ కాలిపోయాయి. మాకు తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్టలు కూడా లేకుండా అన్ని కాలిపోయాయి. దిక్కుతోచని స్థితిలో ఉన్నాం.

– రాజేశ్, వలస కూలీ, ఛత్తీస్‌గఢ్

ప్రభుత్వం ఆదుకోవాలి



పని కోసం వచ్చిన కూలీల ఇళ్లు కాలిపోయాయి. వెంటనే ఇక్కడున్న కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వ అధికారులు వారికి పునరావాస చర్యలు చేపట్టాలి. కనీసం ఉండడానికి స్థలం ఇచ్చి, నిత్యవసరాలు అందించాలి. నివాసం ఉండే స్థావరాలు కాలిపోవడం బాధాకరం.

– రాజు, సిరిసిల్ల

నిషేధంపై నిర్లక్ష్యం

- అంజన్న ఆలయంలో యథేచ్ఛగా సెల్‌ఫోన్ల వినియోగం
- మూలవిరాట్ ఫొటోలు, వీడియోలు తీస్తున్న భక్తులు
- పట్టించుకోని ఆలయ అధికారులు


ఆలయంలో ఫొటోలు దిగుతున్న భక్తులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలోకి భక్తులు సెల్‌ఫోన్లు తీసుకెళ్లొద్దనే నిబంధనలు ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రధాన ఆలయంలోకి వెళ్లే అర్చకులు, సిబ్బంది ఎవరైనా సరే తమ ఫోన్లను బయటపెట్టి రావాలి. కానీ ఆలయంలో భక్తులతో పాటు అర్చకులు, సిబ్బంది ఇష్టారీతిన మూలవిరాట్ ఫొటోలు, వీడియోలు తీస్తున్నారు.

నిర్లక్ష్యమెందుకు?

కొండగట్టు ఆలయంలో సెల్‌ఫోన్ నిషేధం ఉన్నట్లు అధికారులు సూచికలు ఏర్పాటు చేశారు. కానీ ఎవరు పడితే వారు మూలవిరాట్ ఫొటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్నారు. శాస్త్రం ప్రకారం మూలవిరాట్‌ను స్వయంగా వచ్చి దర్శించుకోవాలి తప్ప ఫొటోలు, వీడియోలు తీయరాదని అర్చకులు చెబుతున్నారు. వేరే ఆలయాల్లో ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫోన్లు తీసుకెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నారు. కొండగట్టు ఆలయంలో కూడా 2022లో సెల్‌ఫోన్లు భద్రపరిచే టెండర్ పిలిచారు. సదరు టెండర్ పూర్తి కాగా మళ్లీ అధికారులు నిర్వహించలేదు. అప్పటినుంచి ఎవరు పడితే వారు ఆలయంలోకి ఫోన్లు తీసుకెళ్లి ఫొటోలు తీస్తున్నారు. కొన్నిసార్లు ఫొటోలు తీసే క్రమంలో భక్తులకు అధికారులకు గొడవలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ఆలయ అధికారులు సెల్‌ఫోన్లను ఆలయంలోకి తీసుకెళ్లకుండా కట్టుదిట్టంగా నిషేధం అమలు చేయాలని భక్తులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



నేను ఇటీవలే ఆలయ ఈవోగా బాధ్యతలు తీసుకున్నా. ఫోన్ల కౌంటర్ కోసం టెండర్ ఎందుకు నిర్వహించ లేదో తెలుసుకుంటా. ఆలయంలోకి ఫోన్లు తీసుకెళ్లకుండా చర్యలు చేపడుతాం.

– కృష్ణప్రసాద్, ఈవో, కొండగట్టు

కౌంటర్ ఏర్పాటు చేయాలి



భక్తులు ఆలయంలోకి ఫోన్లు తీసుకెళ్లకుండా అధికారులు సిబ్బందిని నియమించి ఫోన్లు భద్రపరిచేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలి. నిబంధన ఉల్లంఘించిన వారిపై జరిమానా విధించాలి లేదా గతంలో వలె టెండర్ నిర్వహించాలి.

– కొండ మారుతి, భక్తుడు

నిషేధం చేపట్టండి



సామాన్య భక్తులకు ఒక రూల్, వీఐపీలకు ఒక రూల్ ఉండొద్దు. హోంగార్డులు, సెక్యూరిటీ గార్డులు, అధికారులు ఉన్నా ఫోన్‌లు లోపలికి ఎలా వెళ్తున్నాయి. స్వామివారి మూలవిరాట్‌ను ఫొటోలు తీయడం ఎక్కువైంది. ఇప్పటికైనా ఆలయ అధికారులు పకడ్బందీగా సెల్‌ఫోన్ నిషేధం చేపట్టాలి.

– గద్దం నడిపి మల్లేశం, భక్తుడు, గొల్లపల్లి

ఫొటోలు తీయడం సరికాదు



గర్భాలయంలో ఉన్న మూలవిరాట్‌ను భక్తులు, ఇంకా ఎవరైన సరే స్వయంగా వచ్చి దర్శించుకోవాలి. దీంతో స్వామివారు ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయి. ఫోన్లలో ఫొటోలో తీయడం సరికాదు.

– కపిందర్ స్వామి, స్థానాచార్యులు, కొండగట్టు

బైక్ అదుపుతప్పి యువకుడికి తీవ్రగాయాలు

మల్యాల(చొప్పదండి): బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. మల్యాల మండలం రాజారం గ్రామానికి చెందిన బక్కశెట్టి అరవింద్ ఆదివారం రాత్రి మల్యాల నుంచి రాజారం వెళ్తుండగా, స్థానిక బ్లాక్ చౌరస్తా సమీపంలోని విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో విద్యుత్ స్తంభం విరిగిపోగా, అరవింద్ తీవ్రంగా గాయపడ్డాడు. విద్యుత్ అంతరాయం ఏర్పడింది. పోలీసు కానిస్టేబుల్ సురేశ్ ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని 108లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రైలులో బిహార్ ప్రయాణికుడి మృతి


సుఖదేవోదాస్ మృతదేహం

రామగుండం: బెంగళూరు నుంచి బిహార్ వెళ్తున్న ఓ ప్రయాణికుడు రైలులో అస్వస్థతకు గురై మృతిచెందిన ఘటన ఆదివారం రామగుండంలో జరిగింది. జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి తిరుపతి తెలిపిన వివరాలు.. బిహార్ రాష్ట్రం వైశాలి జిల్లాకు చెందిన సుఖదేవోదాస్(65) బెంగళూరులో సఫాయి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నేపథ్యంలో తన స్వగ్రామానికి వెళ్లేందుకు బెంగళూరులో సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ జనరల్ కోచ్‌లో ఎక్కి ప్రయాణిస్తున్నాడు. మార్గమధ్యలో వేకువజామున అస్వస్థతకు గురవడంతో బోగీలోని ప్రయాణికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రామగుండం రైల్వేస్టేషన్‌కు రైలు చేరుకోగానే డాక్టర్ పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి వద్ద లభ్యమైన చిరునామా ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందజేసినట్లు జీఆర్పీ తిరుపతి పేర్కొన్నారు.

ఆకట్టుకున్న డాగ్ స్క్వాడ్ ప్రదర్శన


డాగ్ స్క్వాడ్ విన్యాసాలు

జగిత్యాలక్రైం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో డాగ్ స్క్వాడ్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పోలీస్ వ్యవస్థ పనితీరు, శాంతి పరిరక్షణ కోసం ఉపయోగించే ఆధునాతన సాధనాలు, సాంకేతిక పరిజ్ఞానం, సైబర్ క్రైం, షీటీం, ఫింగర్ ప్రింట్, కమ్యూనికేషన్, బాంబు డిస్పోజల్ టీం, ఆయుధాల గ్యాలరీపై ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి బస్టాండ్ సమీపంలో శనివారం రాత్రి లారీ ఢీకొన్న ఘటనలో గుర్తుతెలియని 60 ఏళ్ల వ్యక్తి మృతిచెందాడు. డ్రైవర్ రాకేశ్ మద్యం మత్తులో నిర్లక్ష్యంగా లారీ నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని నిర్ధారించి అతడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పెద్దపల్లిలోని మార్చురీలో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఇరువురిపై కేసు

మల్యాల: రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఇరువురి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మల్యాల మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన మంద రాకేశ్, జెట్టి అయిలయ్య తక్కళ్లపల్లి గ్రామ శివారులో ఈనెల 25న వాహనాలపై వస్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ సంఘటనలో ఇరువురి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సీసీ రోడ్డుకు భూమిపూజ



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల్లో సీసీరోడ్లకు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సాబేర బేగం ఆదివారం భూమిపూజ చేశారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ పదిర గ్రామంలో రూ.10లక్షలు, హరిదాస్‌నగర్‌లో రూ.10లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గుండాటి రాంరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, నాయకులు గంట బుచ్చగౌడ్, చెన్ని బాబు, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వరినారు ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్

ఆకట్టుకున్న స్టాల్స్

జగిత్యాలటౌన్: పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రభుత్వ శాఖల తరపున అధికారులు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్టాళ్లు ఏర్పాటు చేశారు. పట్టణ పేదరిక నిర్మూలన, వ్యవసాయ, ఉద్యాన శాఖ, మత్స్యశాఖ, మహిళా శిశు సంక్షేమ, దివ్యాంగుల అభివృద్ధి శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. మహిళా సంఘాల ప్రతినిధులు తయారు చేసిన ఆహార పదార్థాలను కలెక్టర్ సత్యప్రసాద్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరిశీలించారు.


కూరగాయలు, పండ్లను పరిశీలిస్తున్న కలెక్టర్, విప్


మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులు

త్యాగధనుల ఫలితమే గణతంత్రం


జెండా ఆవిష్కరిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలక్రైం: ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ అశోక్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఎందరో త్యాగధనుల ఫలితమే గణతంత్ర దినోత్సవమని, వారిని స్మరించుకోవాలని అన్నారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. అదనపు ఎస్పీ భీంరావు, డీఎస్పీలు రంగారెడ్డి, సీఐలు ఆరిఫ్ అలీఖాన్, రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, రామకృష్ణ, వేణు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా అటవీశాఖ కార్యాలయంలో అటవీశాఖ అధికారి రవి ప్రసాద్, పంచాయతీరాజ్ కార్యాలయంలో డీపీవో మదన్ మోహన్, ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ సర్వేశ్, రవాణాశాఖ కార్యాలయంలో డీటీవో శ్రీనివాస్ జెండా ఆవిష్కరించారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ వేణుగోపాల్, రూరల్‌లో సీఐ కృష్ణారెడ్డి జెండా ఆవిష్కరణ చేశారు.

అంతర్జాతీయ పోటీలకు శ్రీజ


శ్రీజను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్

రామడుగు: రామడుగులోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బోగ శ్రీజ అంతర్జాతీయ చిత్రలేఖనం పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్ తెలిపారు. ఆన్‌లైన్‌లో రంగోట్స్ సంస్థవారు నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో జాతీయస్థాయిలో బంగారు పతకం సాధించింది. శ్రీజ వేసిన చిత్రాలు అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడం జరిగిందన్నారు.